క్లుప్తంగా

శిక్షణ ఎస్ఐకి సన్మానం

పెబ్బేరు రూరల్: మండలంలోని పాతపల్లికి చెందిన హరీశ్‌నాయుడు పోలీస్ శాఖలో ఎస్ఐ ఉద్యోగం సాధించి, శిక్షణ పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సూగూరుకు చెందిన మాజీ సర్పంచ్ కె.రాజశేఖర్‌గౌడ్, గ్రామ యువకులతో కలిసి ఆదివారం పాతపల్లిలో ఆయన్ను శాలువాతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో గునమోని పరశురాం, జగదీశ్వర్, పవన్‌కుమార్, శ్రీనివాస్‌లు, లక్ష్మీశేఖర్, చంద్రశేఖర్, కురుమయ్య, విష్ణునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

మన్ననూర్: స్థానిక ఓం చౌరస్తాలో జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ వైస్ ఎంపీపీ, వాసవీ మహిళా సంఘం జిల్లా నాయకురాలు సంబు శోభ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రహీం, నాయకులు వెంకటరమణ, సత్యనారాయణ, రమేష్, ఇస్మాయిల్, రాజు, తిరుపతి, శ్రీను, వసంత పాల్గొన్నారు.

హన్మంత్‌రావు మృతికి సంతాపం



ఆత్మకూర్: కురుమూర్తి దేవస్థానం మాజీచైర్మన్, తిప్డంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ హన్మంత్‌రావు మృతిపై మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, సంస్థానాధీషులు రాజ శ్రీరాంభూపాల్, రాష్ట్ర కల్లుగీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు రహమతుల్లా సంతాపం తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న హన్మంత్‌రావ్ ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోనే మృతి చెందారు. తిప్డంపల్లి గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు, హన్మంత్‌రావ్ సతీమని సుచిత్రను, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేత



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని అంజనగిరి గ్రామ యువకులకు ఏఐసీసీ స్టేట్ కోర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్యారెడ్డి క్రికెట్ కిట్ అందజేశారు. గ్రామ యువకుల కోరిక మేరకు కిట్‌ను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, నారాయణ, యువకులు పాల్గొన్నారు.

పిన్నంచర్లలో ఆటల పోటీలు



ఆత్మకూర్: మకర సంక్రాంతి సందర్భంగా మండల పరిధిలోని పిన్నంచర్లలో సర్పంచ్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడలు నిర్వహించారు. ఆదివారం రాత్రి స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు నగదు, బహుమతులు అందజేశారు. మాసన్న, మశ్చేందర్‌గౌడ్, ఖాజన్న, హరీష్‌గౌడ్, జగన్ ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయండి



వీపనగండ్ల: మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామ సమీపంలో బ్రిడ్జి నిర్మాణాన్ని అర్ధంతరంగా వదిలివేయడంతో ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం పేరుతో గోవర్ధనగిరి, గోపాల్‌దిన్నె గ్రామాల ప్రజలకు అనువుగా ఉండే బొల్లారం కొల్లాపూర్ ఆర్టీసీ బస్సును రద్దు చేశారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. తాత్కాలికంగానైనా బ్రిడ్జి కింద ఉన్న రోడ్డును మరమ్మతు చేసి రద్దయిన బస్సును వెంటనే పునరుద్ధరించాలని కోరుతున్నారు.

గంగిరెద్దుల విన్యాసాలు.. భోగి మంటలు

ఆత్మకూర్: మకర సంక్రాంతి సంబరాలను ఆత్మకూర్ మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. మూడు రోజులుపాటు కుటుంబ సమేతంగా ఇంటి ముంగిట్లో రంగరంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లలో నువ్వుల రొట్టెలు, పిండివంటల ఘుమఘుమలు, గంగిరెద్దుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భార్గవినగర్‌లో చైర్‌పర్సన్ గాయత్రి ఆధ్వర్యంలో భోగి మంటలు పెట్టి సందడి చేశారు. పండుగ సందర్భంగా ఆత్మకూర్ పట్టణ రహదారులు, బస్టాండ్ ప్రయాణికులు లేక బోసిపోయాయి.

మదనాపురం: మండలంలో ఆదివారం భోగి పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు తమ ఇంటి ముంగిళ్లలో రంగు రంగులతో అలంకరించారు. మదనాపురం దుప్పల్లి, కొన్నూరు, గోపన్‌పేట, దంతనూరు తదితర గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది.

చిన్నారులు గాలిపట్టాలు ఎగురవేత

పెబ్బేరు రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీరంగాపురం మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సంబరాలు ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాల్లో ఇళ్ల ముంగిట అందమైన ముగ్గులు అలంకరించారు.

పతంగులు పంపిణీ

పెబ్బేరు రూరల్: జిల్లా కేంద్రంలోని పీర్లగుట్టపై డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద సంక్రాంతి సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు వజ్రాల రమేష్ చిన్నారులకు 50 పతంగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అఖిల, కృష్ణవేణి అవిక, రాధిక పాల్గొన్నారు.



పెబ్బేరులో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

అలరించిన ముగ్గుల పోటీలు

గోపాల్‌పేట: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన మహిళలు 39 జంటలు ముగ్గులు వేశారు. మొదటి బహుమతి అరుణశ్రీ, శ్రీలతకు, యశశ్రీ ఇండెన్ గ్యాస్ ప్రొపరేటర్ సరిత రూ.3 వేలు, రెండో బహుమతిని చంద్రకళ, శిరీషలకు పద్మావతి గార్డెన్స్ ప్రొపరేటర్ ప్రకాశ్ రూ.2 వేలు, మూడో బహుమతిని మానస, హరితలకు శారద రూ.వెయ్యిం అందించారు. కన్సలేషన్ కింద ఎల్ఐసీ ఏజెంట్ కురుమూర్తి ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నోట్‌బుక్, పెన్నులు అందించారు. సర్పంచ్ శ్రీనివాసులు, ప్రకాశ్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ రూ.100 అందించారు. స్థానిక నాయకులు వైస్ ఎంపీపీ శేఖర్, కాశీనాథ్, స్థానికులు పాల్గొన్నారు.



శ్రీరంగాపురంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

కొత్తకోట రూరల్: మండల పరిధిలోని రామకృష్ణాపురంలో పరమేశ్వర భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భవన నిర్మాణ కార్మికులు ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, నర్సింహ, శివరాములు, చంద్రమౌళి, కృష్ణయ్య, సిరాజ్, యండి చాంద్‌పాషా, కె.నరేష్, మహేష్ ఉన్నారు.



ఆత్మకూర్‌లో గంగిరెద్దు విన్యాసాలు

పెబ్బేరు రూరల్: పెబ్బేరు పట్టణ కేంద్రంలో మాజీ సర్పంచ్ అక్కి సుశీల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి చంద్రకల, సునీత, రెండో బహుమతి భాగ్యలక్ష్మి, మూడో బహుమతి నిహారిక గెలుపొందారు. గెలుపొందిన వారికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బహుమతులు అందజేశారు. శ్రీరంగాపురంలోని కంబాలాపురంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎంపీటీసీ ఎల్లస్వామి, శ్రీనివాస్‌గౌడ్, విష్ణువర్ధన్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపురంలో ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలతో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్



ఆత్మకూర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు



వనపర్తిలో పతంగులు పంపిణీ చేస్తున్న నాయకులు



వనపర్తిలోని పాతకోట వీధిలో..

కుటుంబాల స్థితిగతులపై అధ్యయనం



నెలివిడిలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

మదనాపురం: సామాజిక విజ్ఞాన కళాశాల, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన బీఎస్సీ డిగ్రీ విద్యార్థినులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం ద్వారా గ్రామీణ కుటుంబ స్థితిగతులపై అధ్యయం చేస్తున్నారు. మదనాపురం మండలంలోని నెలివిడిలో కేవీకే శాస్త్రవేత్త అనిత ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రవేఫ్ విద్యార్థినులు అంగన్‌వాడీ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువజన దినోత్సవం భవిష్యత్‌ను రూపొందించడంలో యువత కలిగి ఉన్న సామర్థ్యాన్ని శక్తిని గుర్తించిందని ఆమె వెల్లడించారు. యువతలో సానుకూల మార్పును తీసుకురావడంలో వారి పాత్రను గుర్తిస్తూ, యువతరానికి వారి ప్రయత్నాల్లో సాధికారత మద్దతు ఇవ్వడానికి కట్టుబడి ఉండటం లాంటి విషయాలను గూర్చి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు మేఘన, రచన, సుష్మ, చరణ్య, గీత, రసజ్ఞ, పావని తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆంజనేయస్వామి దేవాలయం వద్ద అన్నదానం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఖిల్లాఘట్టు వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారి సుప్రభాతసేవతో ఉత్సవాలు ప్రారంభించారు. దేవాలయం వద్ద పంచామృత అభిషేకం, అష్టోత్తర శత నామావళి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామపెద్దలు, దేవాలయ కమిటీ వారు దేవాలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆంజనేయస్వామిపై ఉన్న భక్తితో స్వామి వారి మాల ధరించిన యువకులు 41 రోజుల పాటు నిష్టతో ఉండి నిత్యపూజలు చేశారు. స్వామి వారి ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని బెస్తగేరి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద మాలధరించిన స్వాములు ఆదివారం ఇరుముడి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసిన వారు అక్కడే గురస్వాములతో ఇరుముడి కట్టించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద అన్నదానం నిర్వహించగా.. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం స్వాములు ఇరుముడితో గుట్టపై ఉన్న వీరాంజనేయస్వామి వద్దకు తరలివెళ్లారు. అదేవిధంగా గ్రామం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహం, పాదుకలు(ఉద్దాలు) ఆంజనేయ స్వామి మాల ధారణ చేసిన స్వాములు ఊరేగింపుగా గ్రామం నుంచి ఘట్టుపైకి చేర్చారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



ఇరుముడితో గ్రామంలో ఊరేగింపు

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మంజుల అన్నారు. సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం రేమద్దులలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని, లబ్ధి పొందాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై, వైద్య ఆరోగ్యశాఖ తరఫున గ్రామంలోని వారికి జాతీయ క్షయవ్యాధిపై, ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డుతో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా, అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. పథకాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ మేనేజర్ వెంకట్ రమణారెడ్డి, డాక్టర్ లారెన్స్, ఆరోగ్యవిస్తరణ అధికారి శ్రీనివాస్ కొండా, రాంచందర్, గోవిందు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆత్మకూర్: ధనుర్మాసం సందర్భంగా ఆత్మకూర్ పట్టణ శివారులోని అష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో శ్రీగోదలక్ష్మినారాయణస్వామి వారి తిరు కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుఝాము నుంచి అభిషేకం, విశ్వక్‌సేనారాధన, సంప్రోక్షణ, దేవతాఅర్చనం పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కల్యానోత్సంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. అలాగే భక్తలకు అన్నదానం, ప్రసాదం పంపిణా చేశారు. ప్రధాన అర్చకులు శేషాచార్యులు, సాకేత్‌చార్యులు, ఆలయ ధర్మకర్తలు పాషం గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



రాములోరి అక్షతలు పంపిణీ

పెబ్బేరు రూరల్: అయోధ్య శ్రీరాములవారి అక్షతలను పెబ్బేరు మున్సిపల్ కేంద్రంతో పాటు శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురంలో ఆదివారం శ్రీరామాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామస్తులు, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకగా, ఊరేగింపుగా వెళ్తూ ప్రతి ఇంటికి అక్షతలతో పాటు ఫొటో, కరపత్రాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, సర్పంచ్ నాగన్న, గ్రామ ప్రజలు, మహిళలు, శ్రీరామ భక్తులు పాల్గొన్నారు.



పెబ్బేరులో శ్రీరామచంద్రస్వామి అక్షతలు పింపిణీ

ఆర్టీసీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

కొత్తకోట రూరల్: మండల పరిధిలోని వడ్డెవాట, చర్లపల్లి గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సును దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ రూట్‌లో గతంలో ఆరు మార్లు బస్సు నడిచేదని, రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆర్టీసీ అధికారులు బస్సును రద్దు చేశారన్నారు. దీంతో కొన్నేళ్లుగా ఇరు గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని ఇరు గ్రామాల ప్రజలు, గ్రామస్తులు కలిసి సమస్యలు తెలియజేశారు. ఎమ్మెల్యే స్పందించి ప్రత్యేక చొరవ తీసుకుని ఆర్టీసీ అధికారులతో మాట్లాడి గతంలో మాదిరిగానే బస్సును నడపాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఇరుగ్రామాల ప్రజల కోరిక మేరకు ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే ప్రారంభించారు.

క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి

పెబ్బేరు రూరల్: క్రీడాకారులు గెలుపు ఓటములను స్ఫూర్తిదాయకంగా తీసుకొని ఆడాలని ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి అన్నారు. మండలంలోని గుమ్మడంలో ఆదివారం సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. గ్రామ పరిధిలోని క్రీడా స్థలాన్ని కొందరు వ్యక్తులు అన్యాక్రాంతం చేశారని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన క్రీడా ప్రాంగణానికి సంబంధించి భూ దస్తావేజులతో కలెక్టర్‌ను సంప్రదించాలని వారికి సూచించారు. అనంతరం తిప్పాయిపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిశారు. గ్రామానికి మంజూరైనా బీటీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి అందించారు. స్పందించిన ఆయన అధికారులతో ఫోన్లో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. వెంటనే పనులు ప్రారంభించడానికి ప్రయత్నిస్తాన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సువర్ణ, తిప్పాయిపల్లి గ్రామస్తులు ఎల్లస్వామి, కొండారెడ్డి, నవీన్‌గౌడ్, చాకలి రాముడు, వైస్ ప్రసిడెంట్ కాశన్న, మన్యం పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిలలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితులు స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అంతకు ముందు స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు దంపతులు పాల్గొన్నారు. అనంతరం సోమేశ్వరాలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. లలితాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిలేటి, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని జూపల్లిలో ఆదివారం కాటమయ్య ఆలయంలో భక్తిశ్రద్ధలతో యజ్ఞం నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో హోమం ఏర్పాటు చేశారు.

చర్యలేవీ..?

చేప వంటకాల మాటున మద్యం అమ్మకాలు

- జూరాల ఎడమ కాల్వ వద్ద అక్రమ దందా
- చర్యలు చేపట్టని అధికారులు



జూరాల ఎడమ కాల్వ సమీపంలో చేప వంటకాల గుడారాల్లో మద్యం విక్రయాలు(ఫైల్)

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ వద్ద చేప వంటకాలకు షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. వాటితో పాటు మద్యం విక్రయాలు చేపడుతున్నారు. గ్రామాల్లో బెల్టు షాపులుంటే చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తున్న అధికారులు వీటిని నియంత్రించలేక పోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎడమ కాల్వ సమీపంలో చేప వంటకాల తయారీ ఉండటంతో ప్రాజెక్టు సందర్శనార్థం వస్తున్న పర్యాటకులతో పాటు సమీపంలోని ఆయా గ్రామాల యువకులతో నిత్యం కిటకిటలాడుతోంది. వీటికి తోడు కొంతమంది అక్రమంగా మద్యాన్ని చేప వంటకాల గుడారాల్లో విక్రయిస్తుండటంతో మందు, చేప ముక్కలతో విందు చేసుకోడానికి వస్తుంటారు. కొన్ని సంవత్సరాలుగా ఇదే తంతు కొనసాగుతుండటంతో దూర ప్రాంతాల నుంచి వినోదం కోసం వస్తున్న యువకులు ప్రధాన ఎడమ కాల్వలో ప్రవహిస్తున్న నీటిని చూస్తూ.. వాటిలో సరదాగా ఈత పడేందుకు యత్నిస్తూ.. తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు.

- జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదనీరు వచ్చి చేరుకునే సమయంలో క్రస్ట్‌గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్న సందర్భంలో పుష్కరఘాట్ వద్ద వేగంగా ప్రవహిస్తున్న నీటిలో సెల్ఫీల మోజులో కాలు జారిపడటం, ఈతకొట్టడం వంటి సంఘటనలతో ఎంతో మంది ప్రాణాలను తమ కుటుంబ సభ్యుల ముందే పోగొట్టుకున్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు దిగువ పుష్కరఘాట్ రహదారిని మూసివేయడంతో పర్యాటకులను అటుగా వెళ్లనీయకుండా నివారించ గలుగుతున్నారు.

మద్యం విక్రయాలే ప్రధాన కారణం..

జూరాల ప్రధాన ఎడమ కాల్వ విభాగంలో చేపవంటకాల వద్ద అక్రమంగా మద్యం విక్రయించడంతో యువకులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి విందు వినోదాల కోసం అధిక సంఖ్యలో వస్తుంటారు. బయటి మార్కెట్ కన్న అత్యధికంగా మద్యం అమ్ముతున్నా.. ఎంజాయి చేయాలనే భావనలో ఉన్న యువకులు, వాటిని కొనుగోలు చేస్తూ.. అక్కడే సేవిస్తూ.. మద్యం మత్తులో ప్రవహిస్తున్న కాల్వలో దిగే ప్రయత్నాలు చేస్తున్నారు. నాలుగు సంవత్సరాల కిందట మద్యం విక్రయాలపై చర్యలు తీసుకున్న యంత్రాంగం ప్రస్తుతం పట్టించుకోకపోవడంతో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి.

మద్యం విక్రయాలు అరికట్టేందుకు చర్యలు..



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ సమీపంలో చేప వంటకాల తయారీ గుడారాల వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని తెలిసింది. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు, మద్యం సేవించడం నిషేధం. అక్రమంగా మద్యం విక్రయించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– జగన్మోహన్ ఎస్ఐ, అమరచింత